సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్ఓ

కేసారం పల్లె దవాఖానాలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ కోటాచలం

సూర్యాపేట రూరల్, జూలై 27 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. మండల పరిధిలోని కేసారం గ్రామంలో శనివారం ఆయన పల్లె దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు స్రవంతి, సుష్మ, సిబ్బంది అంజయ్య, ఉపేంద్ర, రాజేశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఆత్మకూర్.ఎస్, జూలై 27 : విద్య, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వద్ద పీడీఎస్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య మాట్లాడుతూ బడ్జెట్‌పై నిరుద్యోగులు, విద్యార్థులు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయన్నారు. కార్యక్రమంలో పీడీఎస్యూ నాయకులు జలగం సుమంత్, పిడమర్తి భరత్, పీవైఎల్ జిల్లా కోశాధికారి బండి రవి, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సమ్మ, సంధ్య, మానస, ప్రవళిక, శైలజ తదితరులున్నారు.

నడిగూడెం తాసీల్దార్‌గా సరిత

మాట్లాడుతున్న తాసీల్దార్ సరిత

నడిగూడెం, జూలై 27: మండల తాసీల్దార్‌గా వి.సరిత శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. ఈమె ఆదిలాబాద్ జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. నడిగూడెం తాసీల్దార్ హేమమాలిని సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు.

భూమి అక్రమంగా పట్టా చేయించుకున్నాడని ఆర్డీఓకు ఫిర్యాదు

ఆర్డీఓ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న బాధితులు

బొడ్రాయిబజార్, జూలై 27 : పండుగకు ఇంటికి తీసుకెళ్లి మేనల్లుడు భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఓ కుటుంబం శనివారం ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండల కేంద్రానికి చెందిన గురువోజు గోపయ్య-సోమక్క దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉండగా అందరికీ వివాహాలయ్యాయి. చిన్న కుమారుడు రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆరేండ్లుగా గోపయ్య - సోమక్క దంపతులు పెద్ద కుమారుడు సోమాచారి వద్ద ఉంటున్నారు. ఆరు నెలల క్రితం చిన్న కుమార్తె పద్మమ్మ తల్లిదండ్రులను పండుగకని ఇంటికి తీసుకెళ్లింది. ఇదిలా ఉండగా పద్మమ్మ కుమారుడు నాగరాజు అధికారుల అండతో తాత గోపయ్య పేరు మీదున్న సర్వే నంబర్ 211, 213, 215, 216లో ఉన్న 1.12గుంటల భూమిని తన పేరు మీద అక్రమంగా పట్టా చేయించుకున్నట్లు బాధితులు ఆరోపించారు. అంతే కాకుండా పెద్ద కుమారుడు.. తన తండ్రి గోపయ్య పేరు మీద ఎఫ్‌డీ చేసిన రూ1.6లక్షను కూడా వాడుకున్నట్లు పేర్కొన్నారు. ఇదే విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఆర్డీఓ వద్దకు పంపినట్లు వారు వివరించారు. వాయిదా కోసం ఆర్డీఓ ఎదుట తాము హాజరయ్యామని, కానీ మోసం చేసిన వ్యక్తి గైర్హాజరయ్యాడని తెలిపారు. అధికారులు స్పందించి తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలని గోపయ్య దంపతులు, కుమారుడు సోమాచారి కోరుతున్నారు.

మెక్కలు నాటి సంరక్షించాలి : ఎంపీడీఓ


చివ్వెంల : జడ్పీహెచ్ఎస్‌లో మెక్క నాటుతున్న ఎంపీడీఓ సంతోశ్ కుమార్

చివ్వెంల, జూలై 27 : మెక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ సంతోశ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో శనివారం ఆయన మెక్కలు నాటి మాట్లాడారు. ఏపీఓ నాగయ్య, హెచ్ఎం కళారాణి, ఈసీ జ్యోతి, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం డి.మార్కండేయులు పాల్గొన్నారు.

నాగారం : ప్రతి ఒక్కరూ మొక్కల్ని విరివిగా నాటాలని ఎంపీడీఓ దార శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శనివారం ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి హర్షవర్ధన్, యాదగిరి, వినోద్ పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

యాగయ్య (ఫైల్)

అర్వపల్లి, జూలై 27 : జాజిరెడ్డిగూడెంలో మనస్తాపానికి గురై శనివారం వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రైతు నిమ్మల యాగయ్య(38) తాగుడుకు బానిసయ్యాడు. భార్య ఉపేంద్రతో నిత్యం గొడవలు పడుతుండడంతో విసిగిన ఆమె యాగయ్యను విడిచి వెళ్లిపోయింది. కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కుమార్తె ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాకూబ్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

పట్టాదారు పాస్‌బుక్ పోయినది
నెనావత్ పాపనాయక్, S/o.సుక్య, R/o.లోక్యా తండ (గ్రా||), త్రిపురారం (మం), నల్లగొండ (జి), TS, నివాసికి చెందిన పొలం పాస్‌బుక్ (No.T28170240720) త్రిపురారం నుండి లోక్యా తండ వెళ్తుండగా పోయినది దొరికినవారు సంప్ర||9553248365.

PLOT FOR SALE
★YTDA Final Approved 92 Acres Mega Venture @ Bhuvanagiri Town Open Plots for Sale. Opp: Viver Hotel & Collectorate Building 100, 60, 40, 30 All CC Roads & Beautiful Parks, Avenue Plantation, Bank Loans AVL. 9949997199 / 9440415567 / 9866863131.
NT-327685

అద్దెకు బిల్డింగ్ కావలెను
మిర్యాలగూడ మెయిన్ రోడ్డులో నర్సింగ్ హోమ్, హాస్పిటల్ కొరకు గ్రౌండ్ ఫ్లోర్ 2000 Sft నుండి 5000 Sft వరకు అద్దెకు కమర్షియల్ స్పేస్ కావలెను.
7032191119

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ దగ్గరలోని బిరాంచీ కార్యాలయం
సూర్యాపేట : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హుజూర్‌నగర్ : 9182777059 | కోదాడ : 9182777630 | మిర్యాలగూడ : 9182777059
తుంగతుర్తి : 9182777630

జడ్పీహెచ్ఎస్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

జి.తిరుమలగిరి ఎంపీపీఎస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

చివ్వెంల, జూలై 27 : మండల పరిధిలోని జి.తిరుమలగిరి జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్‌తో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాఫ్ రిజిస్టర్‌ను పరిశీలించి అనుమతి లేకుండా గైర్హాజరైన ముగ్గురు ఉపాధ్యాయుల గురించి విద్యాశాఖాధికారిని ఆరా తీశారు. జడ్పీహెచ్ఎస్‌లో పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీపీఎస్‌లో ఇంగ్లీష్ సబ్జెక్టుపై నాలుగో తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. పాఠశాల నిర్వహణపై హెచ్ఎం శైలెజను అభినందించారు. ఆ తరువాత అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కలెక్టర్ కాసేపు మాట్లాడారు. ఆయన వెంట ఉపాధ్యాయులు శ్రీదేవి, వెంకన్న, లలితకుమారి ఉన్నారు.

ఎంపీపీఎస్‌లో బాలసభ

తుంగతుర్తి : వెంపటి ఎంపీపీఎస్‌లో బాలసభ నిర్వహిస్తున్న విద్యార్థులు

తిరుమలగిరి(తుంగతుర్తి), జూలై 27 : మండలంలోని వెంపటి ఎంపీపీఎస్‌లో నో బ్యాగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం బాల సభ నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్ఎం పాలకుర్తి ఎల్లయ్య మాట్లాడుతూ ప్రతి నెలా నాలుగో శనివారం బాలసభ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లెపాక రవీందర్, గుండ్ల ఆంజనేయులు, శిలోజు రమాదేవి, అబ్బగాని మంజుల పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో శనివారం బాల సభ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ మున్సిపల్ చైర్పర్సన్ శాంగటి అనసూయరాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీ దరఖాస్తుల స్వీకరణ


సూర్యాపేట రూరల్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సూర్యాపేటరూరల్, జూలై 27 : మండల పరిధిలోని కేసారం రైతు వేదికలో రూ.లక్ష లోపు రుణమాఫీ కానీ రైతుల నుంచి శనివారం అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. అదే విధంగా రైతుబీమా దరఖాస్తులు కూడా తీసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ దినకర్, వ్యవసాయ విస్తరణాధికారి ముత్తయ్య, రైతులు ఉన్నారు.

అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెం, తిమ్మాపురం క్లస్టర్ పరిధిలోని రైతు వేదికల్లో రైతుబీమా దరఖాస్తులను ఏఓ మల్లారెడ్డి శనివారం స్వీకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు సత్యం, శోభారాణి, రైతులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్‌తో సురక్షిత నీరు : ఎంపీడీఓ

దిర్శనపల్లిలో సర్వేలో పాల్గొన్న ఎంపీడీఓ సునీత

నూతనకల్, జూలై 27 : జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ సురక్షిత నీరు అందించాలనే లక్ష్యంతో సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సునీత అన్నారు. మండలపరిధిలోని దిర్శనపల్లి గ్రామంలో శనివారం జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికి తిరిగి అభిప్రాయాలు సేకరించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి వెంకన్న, సభ్యులు ఉన్నారు.

దాతల సాయంతో పారిశుధ్య పనులు

మాచనపల్లిలో జేసీబీతో బురదను తొలగిస్తున్న యూత్ సభ్యులు

నూతనకల్, జూలై 27 : మండల పరిధిలోని మాచనపల్లి యూత్ సభ్యుడు బొల్క కొమురయ్య, గౌడ్ సంఘం సొసైటీ చైర్మన్ చామకూరి రమేశ్ శనివారం తమ సొంత ఖర్చుతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో చేరిన చెత్త, బురదను జేసీబీతో శుభ్రం చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వెంకన్న, సందీప్, ఆశ కార్యకర్తలు సుజాత, లింగమ్మ ఉన్నారు.

'7.3శాతం బడ్జెట్‌తో విద్యావ్యవస్థ నిర్వీర్యం'

నిరసన వ్యక్తం చేస్తున్న తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు

బొడ్రాయిబజార్, జూలై 27 : బడ్జెట్‌లో విద్యారంగానికి 7.3 శాతం బడ్జెట్ కేటాయించడంతో విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతుందని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు అన్నారు. విద్యా రంగానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కొత్తబస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు.

మాదక ద్రవ్యాల నియంత్రణను బాధ్యతగా తీసుకోవాలి : ఎస్ఐ పరమేశ్

మేళ్లచెర్వు, జూలై 27 : నేటి సమాజంలో మాదకద్రవ్యాల నియంత్రణను ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని మేళ్లచెర్వు ఎస్ఐ పరమేశ్ సూచించారు. స్థానిక కృషి విద్యాలయంలో కృషి ఫౌండేషన్- కోదాడ రూరల్ పోలీస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కృషి ఫౌండేషన్ సభ్యులు రవి, అంజి, హెచ్ఎం రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం: ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి

మోతె, జూలై 27 : మానవ అక్రమ రవాణా నేరమని ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సత్యార్థి చిల్డన్ ఫౌండేషన్ సౌజన్యంతో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలెప్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్ఐ హాజరై మాట్లాడారు. అనంతరం దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీసీడీఓ పూలన్, తాసీల్దార్ సంఘమిత్ర, ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

నేరేడుచర్ల, జూలై 27 : మండలంలోని పెంచికల్‌దిన్నె జడ్పీహెచ్ఎస్‌లో శనివారం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకుడు మామిడి సత్యనారాయణ మాట్లాడుతూ జీవితంలో ఎదరయ్యే సమస్యలను ఎదుర్కొనడానికి అవసరమైన నైపుణ్యతను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు కార్యక్రమంలో హెచ్ఎం ఎల్.శ్రీనివాస్, విద్యార్థులున్నారు.

టీఎమ్మార్పీఎస్ నూతన కమిటీ

ఆత్మకూర్.ఎస్, జూలై 27 : టీఎమ్మార్పీఎస్ మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా బొడ్డు లింగయ్య, గ్రామశాఖ అధ్యక్షుడిగా పడిదల చిరంజీవి, శ్రీశైలం, కృష్ణ, వీరయ్య, నాగయ్య, ముల్కలపల్లి ఎల్లయ్య తదితరులు ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు కత్తి ఉపేందర్ నియామక పత్రం అందించారు. అనంతరం ఆగస్టు 6,7 తేదీల్లో జరిగే చలో ఢిల్లీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సత్యం, వెంకన్న, సైదులు ఉన్నారు.

సాగర్ నీటితో చెరువులు నింపాలి : సీపీఐ

గరిడేపల్లి, జూలై 27 : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నీటితో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులను నింపాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, అప్పయ్య, అంజిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో మహిళల సంక్షేమంపై వివక్ష : సృజన

చింతలపాలెం, జులై 27 : కేంద్ర బడ్జెట్‌లో మహిళల సంక్షేమంపై వివక్ష చూపిందని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన అన్నారు. మండల కేంద్రంలో మహిళా విస్తృత నిర్మాణ కౌన్సిల్ సమావేశం భీమ్‌శెట్టి అధ్యక్షతన శనివారం జరిగింది.

కోడాడ విద్యార్థికి ఐఐటీలో జాతీయ స్థాయి ర్యాంకు

కోదాడ రూరల్, జూలై 27 : మండల పరిధిలోని మిట్యాతండాకు చెందిన భూక్యా ఆనంద్‌సాయికి ఐఐటీలో జాతీయ స్థాయిలో 753వ ర్యాంకు వచ్చింది. ఆనంద్‌సాయి స్థానిక తేజ విద్యాలయంలో 6 నుంచి పదో తరగతి వరకు చదివాడు. శనివారం పాఠశాల యాజమాన్యం విద్యార్థిని సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ ఉస్తెల సోమిరెడ్డి, శ్రీరాం జానకిరాములు, పోతుగంటి నాగేశ్వర్‌రావు, చెన్నకేశవరావు, శ్రీనివాస్‌రావు, సుధాకర్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

ఆత్మకూర్.ఎస్, జూలై 27 : మండలంలో శనివారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సంఘం గుగులోతు తావుర్య, కొల్లు సత్యనారాయణ రెడ్డి, సుధాకర్, చౌదరిరెడ్డి, సత్యనారాయణ, పి.నరేందర్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

దుకాణ నిర్వహణకు ముగిసిన వేలం

బొడ్రాయిబజార్, జూలై 27 : జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ సహిత విశ్వనాథవ స్వామి ఆలయానికి ముందున్న దుకాణానికి రెండేండ్లకు గాను శనివారం ఆలయ ఆవరణలో వేలం నిర్వహించారు. భరత్ గౌతమ్ అనే వ్యక్తి నెలకు రూ.7,050 కిరాయికి పాడడంతో ఆయనకు కేటాయించారు.

'చేనేతను ఆదుకోవాలి'

తిరుమలగిరి, జూలై 27 : ప్రభుత్వం చేనేతను ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి వంగరి బ్రహ్మం అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో చేనేత రంగాన్ని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు.

'గొల్లకుర్మలను విస్మరించిన ప్రభుత్వం'

తిరుమలగిరి, జూలై 27 : ప్రభుత్వం బడ్జెట్‌లో గొల్లకుర్మలను పూర్తిగా విస్మరించిందని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ గొల్ల కుర్మలకు రెండో విడుత గొర్రెల పంపిణీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారని విమర్శించారు.

చెరువు తూము తీసిన వ్యక్తిపై కేసు

మద్దిరాల, జూలై 27 : చెరువు తూము తీసి నీరు కిందకి వెళ్లదీసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధు శనివరం తెలిపారు. మండలంలోని చిననెమిల పెద్దచెరువులో చేపలు పట్టడానికి చెరువు కాంట్రాక్టర్ బెత్తం లింగయ్య తూము తీసి నీటిని కిందకి పంపే ప్రయత్నం చేశాడు. దీనిపై నీటి పారుదల శాఖ ఏఈ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు లింగయ్యపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

మద్దిరాల, జూలై 27 : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి డాక్టర్ నగేశ్‌నాయక్ శనివారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ సత్యనారాయణ రెడ్డి, ఎంపీఓ రాజేశ్, ఏపీఓ వెంకన్న, వైద్యులు, హెల్త్ అసిస్టెంట్ తదితరులున్నారు.

ఉచిత కంటి పరీక్షలు అభినందనీయం

నూతనకల్, జూలై 27 : లయన్స్ క్లబ్ ఉచితంగా కంటి పరీక్షలు చేయడం అభినందనీయమని క్లబ్ అధ్యక్షుడు నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం క్లబ్ ఆధ్వర్యంలో 110 మందిని పరీక్షించి 22 మందికి ఆపరేషన్‌కు రెఫర్ చేసినట్లు డాక్టర్ పవన్ తెలిపారు.

గౌడ సంఘం సభ్యత్వ కార్డులు అందజేత

సూర్యాపేటరూరల్, జూలై 27 : మండలంలోని కాసరబాద గౌడ సంఘం సభ్యులకు శనివారం సభ్యత్వం కార్డులు అందించారు. కార్యక్రమంలో గౌడ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు లింగయ్య, కోశాధికారి వెంకన్న, కో-ఆర్డినేటర్ బుచ్చయ్య, వెంకన్న పాల్గొన్నారు.

యూనిఫామ్ స్టిచ్చింగ్‌తో మహిళలకు ఉపాధి

● మున్సిపల్ చైర్పర్సన్ అన్నపూర్ణ

పాఠశాలల నిర్వాహకులకు యూనిఫామ్ అందిస్తున్న మున్సిపల్ చైర్పర్సన్ అన్నపూర్ణ

బొడ్రాయిబజార్, జూలై 27 : అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా మహిళా పొదుపు సంఘాలకు స్వశక్తి కుట్టు కేంద్రం ఏర్పాటు చేసి యూనిఫామ్ కుట్టించడంతో వారికి ఉపాధి లభిస్తుందని మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. ఈ సందర్భంగా సంఘ మహిళలు కుట్టిన యూనిఫామ్‌ను శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆయా పాఠశాలలకు అందించి మాట్లాడారు. మొత్తం 43 పాఠశాలల్లో పిల్లలకు యూనిపామ్ కుట్టే బాధ్యతను మెప్మా పొదుపు సంఘాల మహిళలకు అప్పగించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఈఈ జేకేడీ ప్రసాద్, ఇంజినీరింగ్ సెక్షన్ ఎస్ఎస్ ఆర్ ప్రసాద్, టీఎంసీ శ్వేత, సీఈఓ సువర్ణ, ఉమ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

సాయిబాబా ఆలయ సమీపంలో ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభం

మేళ్లచెర్వు, జూలై 27 : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ఏండ్ల కింద వీటిని ఏర్పాటు చేయడంతో పలుచోట్ల శిథిలావస్థకు చేరగా.. మరికొన్ని చోట్ల కిందికి ఒరిగి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. మండల కేంద్రం నుంచి వేపలమాధవరం వెళ్లే దారి, స్థానిక సాయిబాబా మందిర సమీపంలో ఉన్న స్తంభాలు కిందికి ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మార్గాల్లో పాఠశాలలు, ఆలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లే వారు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఒరిగిన స్తంభాలతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయపడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

చినుకుకే చిత్తడి..!

● చింతబండ ప్రాథమిక పాఠశాల రోడ్డు అస్తవ్యస్తం

చిత్తడిగా మారిన రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

నేరేడుచర్ల, జూలై 27 : పట్టణ పరిధిలోని చింతబండ ప్రాథమిక పాఠశాల పొలాలకు ఆనుకొని ఉంది. వర్షాకాలం కావడంతో పాఠశాలకు వెళ్లే రోడ్డు మొత్తం చిత్తడిగా మారింది. దీంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఆ పాఠశాలకు వెళ్లాలంటే మండల పరిషత్ కార్యాలయం పక్కనే ఉన్న ఎన్ఎస్పీ కాల్వ కట్టమీద నుంచే వెళ్లాలి. ముందే గుంతలుగా ఉండే మట్టి రోడ్డు.. చినుకు పడితే చాలు బురదమయంగా మారుతున్నది. ఈ రోడ్డుపై ద్విచక్రవాహనదారులు సైతం అదుపుతప్పి గాయాల పాలైన సంఘటనలూ ఉన్నాయి. సాగర్ నీరు విడుదలైన సమయంలో ఇక్కడ పరిస్థితి మరింత ప్రమాదకరం. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి, పాములు సంచరిస్తుంటాయని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించి, సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌కు నివాళి

అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న విజయీభవ ట్రస్టు సభ్యులు

కోదాడ, జూలై 27 : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా విజయీభవ, స్వర్ణభారతి ట్రస్టు, ఇరుకుళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని గాంధీపార్క్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు మాట్లాడుతూ భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొంది ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న గొప్ప వ్యక్తి కలామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో స్వర్ణభారతి ట్రస్టు అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాస్‌రావు, ఇరుకుళ్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చెన్నకేశవరావు, యాద సుధాకర్, పుల్లకాండం, సాంబశివరావు, గుడుగుంట్ల సాయి, పైడిమర్రి రామారావు, జగిని ప్రసాద్, వెంకటనారాయణ, వెంకటేశ్వర్‌రావు, రవి పాల్గొన్నారు.

చిల్లేపల్లి చెక్‌పోస్ట్ వద్ద నాకాబంధీ

చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ రవీందర్ నాయక్, సిబ్బంది

నేరేడుచర్ల, జూలై 27 : మండలంలోని ఉమ్మడి జిల్లా సరిహద్దు ప్రాంతం చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద శనివారం సాయంత్రం ఎస్ఐ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ఇటీవల జిల్లాలో పెద్ద ఎత్తున గంజాయి, గుట్కా, పీడీఎస్ బియ్యం పట్టుబడిన విషయం తెలిసిందే. జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు సాయంత్రం 5:30 నుంచి 9:30 వరకు సరిహద్దు చెక్ పోస్టు వద్ద వచ్చి పోయే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి ధ్రువ పత్రాలను పరిశీలించారు.